ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 3 జనవరి 2024 | 5



అధినేతలు ఆగయా..



- నేడు సీఎం జగన్ కాకినాడ రాక
- ఉదయం 10.40గంటలకు రంగరాయ మెడికల్ కాలేజీ మైదానంలో బహిరంగ సభకు హాజరు
- ఇక్కడి నుంచే పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులు విడుదల
- అనంతరం 12 నుంచి 1 గంట వరకు జిల్లా పార్టీ నేతలతో హెలిపాడ్ వద్ద సమీక్ష
- మరోపక్క ఈనెల రేపు పవన్ కాకినాడకు రాక.. మూడు రోజులు ఇక్కడే మకాం
- కాకినాడ సిటీ, ఉమ్మడి తూ.గో. జిల్లాల నియోజకవర్గాలపై సమీక్ష
- ఈనెల 10న తుని రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు.. లక్ష మందితో సభ
- ఈ నెల 20న అమలాపురం పార్లమెంట్ పరిధిలోని మండపేటలో బాబు సభ
- పార్టీల అధినేతల వరుస పర్యటనలతో జిల్లాలో ఎన్నికల జోష్

- 7లో

చిట్టిబాబుకు ఝులక్ వేణు బదిలీ





- రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల వైసీపీ ఇన్‌చార్జిలు మార్పు
- పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు ఝులక్
- ఆయన స్థానంలో కొత్త ఇన్‌చార్జిగా జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్
- మంత్రి చెల్లుబోయిన వేణు రాజమహేంద్రవరం రూరల్‌కు బదిలీ
- రామచంద్రపురానికి పిల్లి సూర్యప్రకాష్
- పెండింగులో అమలాపురం ఇన్‌చార్జి
- వైసీపీలో రగులుతున్న అసంతృప్తి



విప్పర్తి వేణుగోపాల్



పిల్లి సూర్యప్రకాష్

అమలాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని రెండు అసెంబ్లీ స్థానాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తూ వైసీపీ అధిష్ఠానం మంగళవారం రాత్రి నిర్ణయం తీసుకుంది. పి.గన్నవరం ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా పని చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావును ఇన్‌చార్జిగా నియమించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ కుమారుడు సూర్యప్రకాష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. రామచంద్రపురం నుంచి మంత్రిగా ఉంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు పార్టీ అందరూ ఊహించినట్టుగానే అధిష్ఠానం ఝులక్ ఇవ్వడంతో ఆయన వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా పోటీపడి భంగపడ్డ విప్పర్తి వేణుగోపాల్‌ను తిరిగి అదే నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ నిర్ణయం తీసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఆయన జడ్పీ చైర్మన్ హోదాలో కొనసాగుతున్నారు. పి.గన్నవరం టిక్కెట్టు కోసం విజయవాడలో డీసీపీగా పనిచేస్తున్న మోకా సత్తిబాబు సతీమణి మోకా రమాదేవి, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, అయినవిల్లి జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు నియోజకవర్గంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, క్యాడర్‌తో చివరి క్షణం వరకూ ప్రయత్నాలు కొనసాగించినప్పటికీ ఫలించలేదు.

దీంతో ఎమ్మెల్యే చిట్టిబాబు అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. అంతేగాక రాజకీయ భవిష్యత్తుపై ఆయన వర్గం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్న ఆసక్తి నియోజకవర్గంలో నెలకొంది. మంత్రి వేణును రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి బదిలీ చేయడంతో ఆయన వర్గీయులు లోలోపల అసంతృప్తిగానే ఉన్నారు. పి.గన్నవరం, రామచంద్రపురం నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్పు చేయడంతో అక్కడ వైసీపీలోని వర్గ రాజకీయాలు ఊపందుకోనున్నాయి. ఇక అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ లేదా ఆయన తనయుడు శ్రీకాంత్ విషయంలో అధిష్ఠానం ఎటూ నిర్ణయం తీసుకోకపోవడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. తొలుత శ్రీకాంత్ పేరునే అధిష్ఠానం ప్రకటిస్తుందని సంకేతాలు ఇచ్చినప్పటికీ అధిష్ఠానం నిర్ణయంపై విశ్వరూప్ అసంతృప్తిగా ఉన్నారు. దీంతో ప్రస్తుతం అమలాపురం ఇన్‌చార్జిపై ఆలోచనలో పడింది.



ఆలమూరు లాకుల వద్ద కాలువ గట్టుపై చెట్లను నరికేస్తున్న దృశ్యాలు



అడ్డంగా నరికేస్తున్నారు!

- ఆలమూరు లాకుల వద్ద చెట్లను కొట్టేసి విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఆలమూరు, జనవరి 2: కాలువ గట్లకు రక్షణగా ఉంటాయనే ఉద్దేశ్యంతో చెట్లను పెంచుతారు. అయితే ఆ చెట్లను అడ్డంగా నరికేసి అయినకాడికి అమ్మేస్తున్న సంఘటన ఆలమూరు లాకుల సమీపంలో వెలుగు చూసింది. లాకుల దగ్గర్లో కాలువ గట్టుపై ఉన్న చెట్లను గుట్టుచప్పుడు కాకుండా నరికి అమ్మకాలు సాగిస్తున్నట్టు సమాచారం. ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్న దిగువ స్థాయి ఉద్యోగుల అండదండలతో ఈ విధంగా జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దారుణం జరుగుతున్నా ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చెట్లను పరిరక్షించాలి



గన్ని బాబి, రైతు, ఆలమూరు

కాలువ గట్లకు రక్షణగా నిలిచే చెట్లను కొందరు స్వార్థంతో నరికేస్తున్నారు. వాటిని పెంచడానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. ఇలాంటి చెట్లను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల మృతదేహాల వద్ద అభిమానులు

కన్నీటి వీడ్కోలు

- అమలాపురానికి టెక్సాస్ రోడ్డు ప్రమాద మృతదేహాలు
- కన్నీటిపర్యంతమైన ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు
- నివాళులర్పించిన మంత్రులు విశ్వరూప్, వేణు, వివిధ రాజకీయ పార్టీల నేతలు... 7లో



మెడలకు ఉరి తాళ్లు తగిలించుకుని నిరసన తెలుపుతున్న దృశ్యం

ఉరే గతి!

14వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

వేతనాల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

ముమ్మిడివరం, జనవరి 2: సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరంలోని డీఈవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద ఏడు విభాగాల ఉద్యోగులు మెడలకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించని తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు వేతనాలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో ఇచ్చిన టీఏను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండు చేశారు. దీక్షా శిబిరాన్ని ఎంఈవో పి.షాలెంరాజు, సీఐటీయూ నాయకుడు జి.దుర్గాప్రసాద్, ఎస్టీయూ నాయకులు ఎస్ఎస్ మునేశ్వరరావు, టి.దుర్గాప్రసాద్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు సీహెచ్ ప్రసాద్, సత్యనారాయణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి ఎస్.వెంకట్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ల సంఘ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రిసోర్సుపర్సన్ల సంఘ డివిజన్ అధ్యక్షుడు నాగన్న, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచమని అడిగితే ఉద్యోగంలోంచి తీసేస్తారా అని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నెల 5వ తేదీలోపు నిరవధిక సమ్మె విరమించకపోతే నిబంధన ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్తూ ప్రభుత్వం విడుదల చేసిన రెండు పేజీల ప్రతులను రోడ్డు మధ్యనవేసి తగలబెట్టి అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా అంతటా దున్నపోతులకు వినతిపత్రాలకు అందించి వినూత్నంగా నిరసన తెలిపారు.

... వివరాలు 8లో



పి.గన్నవరంలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరమైన వ్యసనం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్, జనవరి 2: మాదకద్రవ్యాల వాడకం ప్రమాదకరమైన వ్యసనమని, నేటి యువతరాన్ని చెడు మార్గాల్లో నడిపించే దురలవాట్లలో ఇదొకటని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్ నియంత్రణపై నియమించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. డ్రగ్స్ అక్రమ సరఫరా, వాడకంపై నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. సరఫరా చేస్తున్న వ్యవస్థలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ ఎడిక్ట్ కేసులను గుర్తించి వారిని స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు వినియోగించడం ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటికి అలవాటుపడ్డ విద్యార్థులు, యువకులు సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులు అవుతున్నారన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైనవారు నేరాలు, అకృత్యాలు చేయడానికి వెనకాడరన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎస్.సుధాసాగర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అధినేతలు ఆగయా..

నేడు సీఎం జగన్ కాకినాడ రాక

రేపు పవన్ కాకినాడకు రాక: మూడు రోజులు అక్కడే మకాం

10న తుని రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు:లక్ష మందితో సభ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల వేడి ఊపందుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల అధినేతల వరుస పర్యటనలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేడెక్కుతోంది. ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని ముందే తెచ్చేస్తోంది. ఇందుకు నిదర్శనమే జిల్లాలో సీఎం జగన్, జనసేన అధినేత పవన్, టీడీపీ అధినేత చంద్రబాబుల వరుస పర్యటనలు.. సభలు నిర్వహిస్తున్న తీరు. రోజుల వ్యవధిలోనే ఈ ముగ్గురు అధినేతలు జిల్లాలోకి అడుగుపెట్టబోతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన సంక్షేమంపై చెప్పుకోవడానికి సీఎం జగన్ నేడు కాకినాడ పర్యటిస్తుండగా, ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తుతూ పోరాడుతున్న జనసేన అధినేత పవన్ ఈనెల 4న, టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10, 20, 27 తేదీల్లో మూడు పార్లమెంట్ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించబోతున్నారు. దీంతో ఈ మూడు పార్టీల రాజకీయ కార్యకలాపాలతో హోరెత్తనుంది.

సీఎం వస్తున్నారు...జనాన్ని తీసుకురండి

సీఎం జగన్ బుధవారం కాకినాడ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరి 10.20 గంటలకు కాకినాడ పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు షో ద్వారా 10.40 గంటలకు రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక నిధులను జగన్ విడుదల చేస్తారు. ఈనెల నుంచి రూ.3 వేల పెన్షన్ డబ్బులను చెల్లిస్తున్న నేపథ్యంలో దాన్ని ప్రచారం చేసుకోవడానికి వీలుగా అక్కడే భారీ బహిరంగసభలో సీఎం ప్రసంగించనున్నారు. తిరిగి 12 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ గంటపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి తాడేపల్లికి పయనమవుతారు. బహిరంగ సభకు ముందు కాకినాడ నగరంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి సీఎం జగన్ ప్రారంభోత్సవాలను చేయనున్నారు. సభావేదికకు సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను జగన్ ఆవిష్కరిస్తారు. కాగా సీఎం జగన్ సభకు వేలల్లో జనాలను తరలించేందుకు ప్రభుత్వం అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి జనాలను తరలించేందుకు పార్టీ నేతలు, అధికారులకు టార్గెట్లు విధించింది. ప్రధానంగా వలంటీర్లు అయితే తమ పరిధిలోని పింఛన్‌దారులను బెదిరిస్తూ ఆడియో మెసేజ్‌లు పంపారు. తమ సమీపంలోని సచివాలయాలకు పెన్షన్‌దారులు బుధవారం ఉదయం ఏడుకు చేరుకోవాలని, అక్కడి నుంచి సీఎం సభకు వెళ్లాలని హుకుం జారీ చేశారు. రాకపోతే పెరిగిన పెన్షన్ డబ్బులు అందవని కూడా హెచ్చరించారు. ఈ మేరకు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఓ వలంటీర్ బెదిరింపుల ఆడియో బయటకు లీకైంది. మరోపక్క ప్రతిపక్ష టీడీపీ నిర్వహించే కార్యక్రమాలకు ఒక్క బస్సు కూడా అద్దెకు ఇవ్వని ఆర్టీసీ, సీఎం సభ కోసం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 318 బస్సులను పంపుతోంది. ఆయా జిల్లాల నుంచి సీఎం సభ కోసం ఇవన్నీ బుధవారం ఉదయం కాకినాడకు చేరుకోనున్నాయి.

మూడు రోజులు పవన్ ఇక్కడే...

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 4న కాకినాడకు రానున్నారు. మూడు రోజుల పాటు ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసచేయనున్నారు. తొలిరోజు కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 28 వార్డులపై విడివిడిగా సమీక్షించనున్నారు. ఆ తర్వాత కాకినాడ రూరల్, అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 12 నియోజకవర్గాలపై సమీక్షిస్తారు. వాస్తవానికి గత నెల 27 నుంచి పవన్‌కల్యాణ్ కాకినాడలో మూడు రోజులు మకాం వేశారు. కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై కూలంకుష సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలపై సమీక్షించారు. ఎక్కడ పోటీచేస్తే బాగుంటుంది? ఎక్కడ ఇంకా పార్టీ మరింత బలోపేతం అవ్వాలి? అనేదానిపై ఇంఛార్జులతో సమీక్షించారు. ఆ తర్వాత మరో రెండు రోజులు ఏకంగా కాకినాడ సిటీ నియోజకవర్గంపై సమీక్షించారు. తద్వారా కాకినాడ సిటీ నుంచి అసెంబ్లీకి పవన్ పోటీ చేస్తారనే ప్రచారానికి మరింత బలం కల్పించారు. తిరిగి మళ్లీ ఈనెల 4 నుంచి మూడు రోజులు ఇక్కడే మకాం వేయడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. పవన్ కాకినాడలో ఉన్నప్పుడే జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆయన్ను కలిశారు. దీంతో వైసీపీ వర్గాలకు భారీ షాక్ తగిలింది. వైసీపీ ఎమ్మెల్యే నేరుగా పవన్ కలవడం జనసేనలో చేరడానికేననే ప్రచారం బలపడింది. అయితే రెండో విడత కాకినాడకు పవన్ వస్తున్న నేపథ్యంలో ఈసారి వైసీపీ నుంచి ఎంతమంది ఎమ్మెల్యేలు వస్తారోననే భయం అధికార పార్టీకి కునుకులేకుండా చేస్తోంది. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను వైసీపీ తప్పించాలని నిర్ణయించింది. వీరిలో ఒకరు ఇప్పటికే పవన్‌ను కలవగా, మిగిలిన ఇద్దరిలో ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

లక్ష మందితో దద్దరిల్లేలా...

టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 10న తునికి వస్తున్నారు. ఆరోజు లక్ష మందితో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. జగన్ ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభల ద్వారా విరుచుకుపడుతున్న చంద్రబాబు అందులోభాగంగా కాకినాడ పార్లమెంట్‌కు సంబంధించి సభను తునిలో నిర్వహిస్తున్నారు. తొలుత పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటన ఖాయం అయినా ఆ తర్వాత వేదిక తునికి మార్చారు. ఆరోజు కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షమందికిపైగా తునికి చేరుకునేలా జిల్లా టీడీపీ సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి సంక్రాంతి తర్వాత సభ నిర్వహించాలని భావించారు. కానీ ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో వాయిదా వేయకుండా సభ జరపాలని పార్టీ వర్గాలు నిర్ణయించాయి. మరోపక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం పార్లమెంట్ పరిధిలో సభను మండపేటలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు జనవరి 20వ తేదీ ఖరారు చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో గోపాలపురంలో ఈనెల 27న చంద్రబాబు బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించింది. పార్టీలో ఎనలేని ఉత్సాహాన్ని నింపి క్యాడర్‌లో విజయోత్సాహాన్ని నింపింది. తిరిగి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టై బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తుండడం విశేషం.

సంక్రాంతికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, జనవరి 2: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రైలు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా పలు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి సమాచారం అందింది. 07093 నంబరు గల సికింద్రాబాద్-బెరహమ్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 8,15 తేదీలలో రెండు ట్రిప్‌లు బయలుదేరనున్నాయి. ఈ రైలు సోమవారం సికింద్రాబాద్‌లో రాత్రి 7.45 నిమిషాలకు బయలుదేరి బుధవారం ఉదయం 6 గంటలకు బెరహమ్‌పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో పిడుగురాళ్ళ, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి మీదుగా సామర్లకోటకు తెల్లవారుజామున 3.45కి చేరుకుని అన్నవరం 4.15కి చేరుకుని అనకాపల్లి మీదుగా బెరహమ్‌పూర్‌కు మంగళవారం ఉదయం 11.15కి చేరుకుంటుంది. 07094 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారంలో జనవరి 9,16లలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి దువ్వాడకు సాయంత్రం 5.30కి చేరుకుంటుంది. అన్నవరానికి రాత్రి 6.23కి చేరుకుంటుందని, సామర్లకోటకు రాత్రి 7.08కి చేరుకుంటుందన్నారు. రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పిడుగురాళ్ల మీదుగా సికింద్రాబాద్‌కు బుధవారం ఉదయం 6 గంటలకు చేరుకుంటుంది. 07272 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 12న శుక్రవారం బయలుదేరనుంది. 07271 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనవరి 13న శనివారం బయలుదేరనుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి సూచించారు.

నకిలీ ఏసీబీ అధికారి అరెస్టు

15 ఏళ్లుగా మోసాలు..ఉద్యోగులను బెదిరించి రూ.లక్షల్లో వసూలు

మండపేట, జనవరి 2: ఏసీబీ ముసుగులో మోసాలు చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మూడు రాష్ట్రాల్లో అతడిపై 100 పైగా కేసులు నమోదై ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడు రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మంగళవారం వివరాలు తెలిపారు. మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న వేంకటేశ్వరరావుకు గతేడాది డిసెంబరు 14న ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకుని 'మీరు రిటైర్‌మెంట్ దగ్గరలో ఉన్నారు, మీపై ఏసీబీ దాడి జరిగితే మీకు రావల్సిన బెనిఫిట్స్ రావు' అని బెదిరించి అతడి వద్ద నుంచి రెండు విడతలుగా రూ.3.5 లక్షలు నగదు కాజేశాడు. తర్వాత ఏఎస్‌ఐ తాను మోసపోయానని గ్రహించి డిసెంబరు 16న మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతపురం జిల్లా కదిరి నియోజకర్గ పరిధిలోని పట్నం మండలం మల్లికవేలమ గ్రామానికి చెందిన రాచంపల్లి శ్రీనివాసులు(వాసు) ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. 15 ఏళ్ల నుంచి ఇలా ఉద్యోగులే లక్ష్యంగా చేసుకుని ఏసీబీ ముసుగులో నేరాలకు పాల్పడుతున్నాడని డీఎస్పీ తెలిపారు. శ్రీనివాసులపై ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో కేసులు నమోదయ్యాయని, శిక్షలు కూడా అనుభవించాడని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో మండపేట రూరల్ ఎస్‌ఐ బళ్ల శివకృష్ణ తన సిబ్బందితో సీఐ శ్రీధర్‌కుమార్ సహకారంతో కర్నాటక రాష్ట్రం బెంగళూరు వెళ్లి అక్కడ పోలీసుల సహాయంతో బెంగళూరులో ఉంటున్న శ్రీనివాసులు కదలికలను గుర్తించారు. నిందితుడు శ్రీనివాసులు మంగళవారం ఉదయం రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్ నుంచి విశాఖకు వెళ్లేందుకు సమా యత్తమవుతున్న సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అతడిపై దాడి చేసి పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2.5 లక్షలు నగదును స్వాధీనం చేసు కుని సీజ్ చేశారు. నిందితుడిను అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు మంగళవారం హాజరుపర్చినట్టు డీఎస్పీ తెలిపారు. కోర్టు అతడికి రిమాండ్ విధించిందని తెలిపారు. నిందితుడు శ్రీనివాసులు డబ్బులు వసూలు చేసే విషయంలో చాలా తెలివిగా వ్యవహరించేవాడు. నేరుగా డబ్బును తన అకౌంట్‌లో కాకుండా ఇతర వ్యక్తుల అకౌంట్‌లోకి వేయమనేవాడు. ఆటోడ్రైవర్లను, రోడ్లపై చిరు వ్యాపారులతో మాట్లాడి డబ్బు అత్యవసరమని, తన ఫోన్ పనిచేయడం లేదని చెప్పి వారి ఖాతాల్లో డబ్బులు వేయించేవాడు. ఉద్యోగులు ఏసీబీ పేరిట వచ్చే ఫేక్ కాల్స్‌కు భయపడవద్దని నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని డీఎస్పీ కోరారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్‌ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం అధికారులపై కేసుల నమోదుకు చర్యలు'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: కృష్ణునిపాలెం భూసేకరణలో పోలవరం అధికారులపై కేసులు నమోదుకు చర్యలు చేపట్టారని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో భూసేకరణ చేసినప్పటి నుంచి ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని, ఆర్‌అండ్‌ఆర్ వర్తింపజేయలేదన్నారు. అసలు పట్టాదారులకు చట్టప్రకారం చెల్లించవలసిన భూమి నష్టపరిహారం వేరే వ్యక్తులకు చెల్లించారని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి ఈ అవకతవకలకు బాధ్యులుగా ఆరుగురు అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మాధవీలత నివేదిక సమర్పించారని వివరించారు. రాజమండ్రి రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన ఎం.జితేంద్ర, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు (భూసేకరణ), స్పెషల్ కలెక్టర్ సీహెచ్ భానుప్రసాద్, పోలవరం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన పీవీవీ గోపాలకృష్ణలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని వెల్లడించారు. అధికారుల చర్యల వల్ల నష్టపోయిన వారంతా ఎస్టీ కులస్తులు కనుక అధికారులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసినందుకు ఐపీసీ 409, అసలు పట్టాదారులను మోసం చేసినందుకు ఐపీసీ 420 ప్రకారం కేసులు నమోదు చేయాలని బాధితులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. భూములు కోల్పోయిన అసలు పట్టాదారులకు చట్టప్రకారం నష్టపరిహారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించాలని కోరారు. పట్టాదారుల వారసులు దిబ్బ శ్రీను, దిబ్బ రమణ, బంటుమిల్లి అచ్చియమ్మ, బంటుమిల్లి రాజేశ్వరి, గరుగుపల్లి జోగరావు, గరుగుపల్లి రాము, ఆదివాసీ మహాసభ కార్యదర్శి అరగంటి వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల 'శోభాయాత్ర'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5,6,7 తేదీల్లో గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వైభవంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాజమహేంద్రవరం పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సభలకు సంఘీభావంగా అపస్మా ఆధ్వర్యంలో చేపట్టిన తెలుగు భాషా వైభవ శోభాయాత్ర కంబాలచెరువు దండిమార్చ్ సెంటర్ నుంచి పుష్కరాలరేవు రాజరాజనరేంద్రుడు విగ్రహం వరకు సాగింది. యాత్రకు విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్యరాజుతో కలిసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాత్మానంద మాట్లాడుతూ ఎన్నో భాషలున్నా తెలుగు భాషను మరువకూడదని, తల్లిని ఎలా గౌరవిస్తామో అమ్మభాషను అలాగే గౌరవించాలన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తుండడం అభినందనీయమని, వాటిని స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి ప్రారంభిస్తారని, జయప్రదం చేయాలన్నారు. అనంతరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ ఎంతో మంది గవర్నర్లను, ప్రముఖులను ఆహ్వానిస్తూ నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చైతన్యరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణకు గైట్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు మహాసభలకు టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో గైట్‌లో చతుర్వేద యజ్ఞం కూడా మొదలైందని, సభలను విజయవంతం చేయాలన్నారు. శోభాయాత్రలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రాజరాజ నరేంద్రుడు, నన్నయ, నారాయణ బట్టారకుల చిత్రాలను ఉంచారు. వేదపండితుల మంత్రాలు, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విద్యార్థుల బ్యాండ్ మేళం నడుమ అనేక మంది కవులు, సాహితీవేత్తలు, ప్రముఖుల ఫొటోలతో ప్రదర్శన చేశారు. రాజరాజ నరేంద్రుడు విగ్రహానికి రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, చిన్నవెంకన్నబాబు, ఆదిత్య డైరెక్టర్ ఎస్‌పీ గంగిరెడ్డి, మంతెన కేశవ రాజు, బైర్రాజు ప్రసాద్, తెలుగు మహాసభల సమన్వయ కర్త సునంద రమేష్, సుమేధ రాజు, అపస్మా అధ్యక్షుడు సుంకవల్లి మురళీ, కళ్యాణ్‌రెడ్డి, పి.శివాజీ, పి.సురేష్, ఈసీ సభ్యులు రమేష్, గంగాధర్, ఫ్యూచర్ కిడ్స్ నవి, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారుడు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ళ వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, గౌరవాధ్యక్షుడు మండేల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం నగరంలో శోభాయాత్ర



శోభాయాత్రకు హాజరైన విద్యార్థులు, నగర వాసులు

రెప్పపాటులో..

ముగ్గురిని బలి తీసుకున్న కారు..ఇద్దరు మహిళలు, చిన్నారి మృత్యువాత



రమాదేవి



దివ్యప్రియ



దేవరపల్లి/ కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 : రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కుటుంబంలో విషాదం నిండిపోయింది. దేవరపల్లి మండలం బంధపురం వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంతో బంధువులు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. నూతన సంవత్సర వేడుకలను ఎంతో ఆనందంగా జరుపుకుని బయలుదేరిన ఆ కుటుంబం.. అంతలోనే విషాదంలో మునిగిపోయింది. చూస్తుండగానే ప్రమాదం జరిగిపోయింది.. మృత్యువు డివైడర్ దాటుకుని వచ్చి ముగ్గురిని మింగేసింది. హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ మాక్స్ సొసైటీ ఏరియా, లింగంపల్లి సంగారెడ్డి జిల్లా ఆర్‌కే రామచంద్రపురం అక్కాతమ్ముళ్లు తమ తమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు గత నెల 30వ తేదీన రెండు కుటుంబాలకు చెందిన 8 మంది తమ సొంత కారులో వైజాగ్‌లోని తమ్ముడి అత్తవారింటికి వచ్చారు. రెండు రోజుల పాటు ఆనందంగా గడిపారు. వైజాగ్ చుట్టుపక్కల ప్రాంతాన్నీ తిరిగి చూశారు. సెలవులు అయిపోవడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు వచ్చిన కారులోనే హైదరాబాద్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం 2 గంటలు అవుతుంది.. ఎక్కడైనా ఆగి భోజనం చేద్దామని అనుకుంటున్నారు. అంతలోనే కృష్ణా జిల్లా నందిగామ నుంచి వైజాగ్‌కు వెళుతున్న కారు డివైడర్ దాటుకుని వేగంగా దూసుకొచ్చి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును ఢీకొట్టింది.. అంతే ఆ క్షణంలో ఏం జరిగిందో తెలియదు.. రెండు కార్లు తుక్కుతుక్కు అయిపోయాయి. అటుగా వెళ్లే ప్రయాణికులకు ఏం జరిగిందో అర్థం కాలేదు.. వాహనదారులు కాసేపటికి తేరుకుని కార్ల దగ్గరకు వెళ్లి చూశారు. రెండు కార్లలో 11 మంది ప్రయాణిస్తుండగా అందరూ తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సుభాష్ గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25) కొవ్వూరు ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మృతి చెందారు. కుమార్తె గనిష్క (19నెలలు) దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటుకుని వచ్చి ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న నందిగామకు చెందిన పాస్టర్ వేల్పూల విజయమోహన్, వేల్పూల సంజనీగ్రేస్, వేల్పూల రోహిన్, అమితశ్రీలు దేవరపల్లిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న వారు అంతా క్షేమంగానే ఉన్నారు. సంఘటన ప్రాంతాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం నుంచి తేరుకున్న సుభాష్ గౌడ్ తన కుటుంబీకులు ఎలా ఉన్నారని పలుమార్లు అడగడం కంటతడి పెట్టించింది. ఎందుకంటే అతనికి తన తల్లి, భార్య, కుమార్తె మృతిచెందారని తెలియదు. సీఐ అనసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నన్నయలో ప్లేస్మెంట్ డ్రైవ్

దివాన్‌చెరువు, జనవరి 2: ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాలలో రెండు రోజులు ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జి.వి.కె.బయోసైన్సెస్ అర్గస్ లైఫ్‌సైన్స్ వారిచే నిర్వహిస్తున్న ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌కు ఉమ్మడిగోదావరి జిల్లాల్లో ప్రస్తుతం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. రాతపరీక్ష ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్.ఆర్.రౌండ్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని జీవీకే బయోసైన్సెస్ అర్గస్ లైఫ్‌సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. వివరాలకు విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ను లేదా విశ్వ విద్యాలయం ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని తెలిపారు.

భారీగా ఎరువులు సీజ్

పి.గన్నవరం, జనవరి 2: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం శ్రీశ్రీనివాస జనరల్ ఏజెన్సీస్ ఎరువుల షాపుపై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎరువులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌కు గోడౌన్‌లో ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో 10.600 మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.2,59,700 విలువ గల ఎరువులను సీజ్ చేసి సంబంధిత షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపిన, స్టాక్ నిల్వలు ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి కళ్యాణ్ సూర్యకుమార్, సిబ్బంది వీరబాబు, లోవరాజు ఉన్నారు.

14 వేల హెక్టార్లలో నష్టం

సీతానగరం, జనవరి 2: రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంట దెబ్బతిందని పొగాకు బోర్డు ఛైర్మన్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రఘుదేవపురంలో మంగళవారం ఆయన పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పొగాకు బోర్డు కేవలం రైతుల అవసరాలను గుర్తించి వారికి అనుకూలంగా ప్రభుత్వంతో చర్చించి పనులు చేయించడం తప్ప హామీలు నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. పొగాకు రైతుల పరిస్థితి, పంట పాడైన విధానాన్ని ప్రయత్నలోపం లేకుండా అధికారులు, మంత్రుల వద్దకు తీసుకువెళ్లామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన రావడం లేదన్నారు. ఈ సందర్భంగా రైతుల తరఫున భారతీయ జనతాపార్టీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, పొగాకు బోర్డు సభ్యులు కాత్రగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పొగాకు వేసిన తర్వాత అర్వెస్టింగ్ వరకు వచ్చిన పంట, అకాల వర్షాలకు దెబ్బతిందని, ఇప్పటికి ఈ ఏడాది మూడుసార్లు పంట వేశారని రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారన్నారు. రాజమహేంద్రవరం నుంచి పొగాకు బోర్డు తొలగించి దేవరాపల్లి బోర్డులో కలపడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, సబ్సిడీపై వచ్చే ఎరువులు కూడా రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సబ్సిడీపై ఎరువులు ఇవ్వడానికి బోర్డుకు అభ్యంతరం లేదని, కానీ రైతు కమిటీ సభ్యులు అంతదూరం వచ్చి ఎరువులు తీసుకువెళ్లే అవకాశం లేదని చెప్పడం వలన ఇవ్వడం లేదన్నారు. మండలాల్లోని సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇచ్చే అవకాశం పరిశీలించాలని రైతులు కోరారు.

టెక్సాస్ నుంచి అమలాపురానికి మృతదేహాలు

ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చిన నాయకులు



ఎమ్మెల్యే పొన్నాడను ఓదార్చుతున్న మంత్రి వేణు

అమలాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని జాన్సన్ కౌంటీలో గల 67వ జాతీయ రహదారిపై గత నెల 26న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అమలాపురం పట్టణానికి చెందిన ఐదుగురు మృతిచెందడంతో వారి మృతదేహాలను మంగళవారం ఉదయం అమలాపురం తీసుకువచ్చారు. మృతులు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ చిన్నాన్న పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కావడంతో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహానికి మృతదేహాలను తరలించారు. వందలాది మంది అభిమానులు, రాజకీయ నాయకులు ఎమ్మెల్యే సతీష్ స్వగృహానికి తరలివచ్చి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సతీష్‌తో సహా కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. చిన్నారుల మృతదేహాలు సైతం అక్కడ చూపరులను కంటతడి పెట్టించాయి. కాగా జాన్సన్ కౌంటీలో ఉన్న 67వ నంబరు హైవేపై పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనాన్ని గత ఏడాది డిసెంబరు 26న ఓ ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు స్వయానా చిన్నాన్న అయినా పొన్నాడ నాగేశ్వరరావు(68), అతని భార్య సీతామహలక్ష్మి (64), కుమార్తె పోతాబత్తుల నవీనగంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిత(9) ప్రమాద స్థలిలోనే మృత్యువాత పడిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను అమెరికాలోని తానా సభ్యుల సహకారంతో సోమవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకుని వచ్చి అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్సుల్లో అమలాపురం తరలించారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ స్వగృహం వద్ద పెద్దసంఖ్యలో రాజకీయపార్టీల ప్రముఖులు, అభిమానులు మృతదేహాలను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు వైసీపీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. అనంతరం రాజమహేంద్రవరంలోని కోటిలింగాల శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నాగేశ్వరరావు అల్లుడు పోతాబత్తుల లోకేశ్ అమెరికాలో చికిత్స పొందుతున్నారు. నివాళులర్పించిన వారిలో వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి బాబు, దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, పెన్మెత్స చిట్టిరాజు, బిళ్ల మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

న్యాయం చేయలేని పోలీస్‌స్టేషన్లు ఎందుకు?

వృద్ధురాలిపై దాడి చేస్తే చర్యలు తీసుకోరా?

పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం



సీఐ శివగణేష్‌ను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, జనవరి 2: రంగంపేట మండలం సుభద్రంపేటలో వృద్ధురాలు ఆమె బంధువులపై జడ్పీటీసీ చేసిన దాడిపై నేటి వరకూ కనీసం విచారణ కూడా చేయలేదని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ సామాన్యులకు న్యాయం చేయలేని పోలీస్ స్టేషన్లు ఎందుకని వాటికి తాళాలు వేయండి అంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 26వ తేదీన తనకు రుణం మంజూరు చేయలేదని అడిగిన వృద్ధ మహిళ వాడపల్లి నాగమణిపైన ఆమె కోడలిపైనా దౌర్జన్యానికి పాల్పడి రక్తం వచ్చేలా కొట్టిన జడ్పీటీసీ పేపకాయల రాంబాబుపై నేటికీ రంగంపేట పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి సీఐ శివగణేష్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగి వారం గడుస్తున్నా కనీసం సంఘటనా స్థలంలో విచారణ కూడా చేయలేదని అధికార పార్టీకి కొమ్ము కాస్తూ సామాన్య ప్రజలను గాలికి వదిలేశారని రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తపై జడ్పీటీసీ రాంబాబు లైంగికంగా వేధింపులకు గురి చేసినా చర్యలు చేపట్టలేదని అన్నారు. ఎస్‌ఐపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ఎంత దూరమైనా వెళతామని ప్రైవేటు కేసులు వేసి న్యాయస్థానంలో తేల్చుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్తి దేవ దానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివా సరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి తదితరులున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మోతుగూడెం, జనవరి 2: సీలేరు నుంచి విజయవాడకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను మోతుగూడెం ఎస్‌ఐ బి.గోపాలరావు, పోలీసు సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. విజయవాడ లబ్బీపేటకు చెందిన షేక్ ఫహీం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనమాక గ్రామానికి చెందిన చల్లా హరినాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం బురగగూడెం గ్రామానికి చెందిన నందిపాటి వంశీ కృష్ణారెడ్డి గంజాయిని రహస్యంగా ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నారు. మోతుగూడెం వద్ద వాహనాలను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రూ.50 వేల విలువ చేసే పది కిలోల గంజాయి, ఏపీ37 బీప 0333 నంబరుతో ఉన్న స్కార్పియో కారు, ఏపీ07 సీఎక్స్ 3368 నంబరుతో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ స్వాధీనం చేసుకున్నారు

ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనం అలవరుచుకోవాలి

మామిడికుదురు, జనవరి 2: ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. పాశర్లపూడిలంకలోని ఉండ్రు సూర్యనారాయణ గ్రంథాయల భవనానికి ఏపీ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి సమకూర్చిన 427పుస్తకాలు, కంప్యూటర్‌ను కలెక్టర్ మంగళవారం గ్రంథాలయానికి అందించారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ విప్పర్తి రమణ, చెరుకూరి సత్తిబాబు, కోలా సత్తిబాబు, పితాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతుకు అంగన్‌వాడీల వినతిపత్రం

- ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతుల దహనం
- చీరలతో ఉరి వేసుకుని నిరసన





మామిడికుదురు: దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం, ముమ్మిడివరంలో చీరలతో ఉరి వేసుకుని అంగన్‌వాడీల నిరసన

అమలాపురం టౌన్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం పట్ల దున్నపోతు మీద వాన కురిసినట్టు వ్యవహరిస్తోందని సంఘ నాయకులు ధ్వజమెత్తారు. ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. జగన్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. రోజులు గడిచిపోతున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని, న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ప్రాజెక్టు నాయకురాళ్లు కె.బేబీగంగారత్నం, పి.అమూల్య, విజయ ఆధ్వర్యంలో జరిగిన సమ్మె శిబిరంలో ఆయా సెక్టార్ల సంఘ నాయకులు జె.మణిమాల, డి.ఉమామహేశ్వరి, వి.నవోమి, పి.కనకమహాలక్ష్మి, ఐ.కనకదుర్గ, కాశిన దుర్గ, ఎం.శమంతకమణి, సీహెచ్ రుక్మిణి, బి.లక్ష్మీకాంతం, జి.సరోజిని, కె.సత్యలలిత, ఎస్.వెంకటలక్ష్మి, కె.పరిపూర్ణ తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం సీఐటీయూ, అంగన్‌వాడీ నాయకులతో చర్చలు జరిపి అంగన్‌వాడీలకు జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు.

ముమ్మిడివరం: డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది.అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షా శిబిరంలో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీల సమస్యల పట్ల దున్నపోతు వలే రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, అందువల్లే తాము దున్నపోతుకు వినతిపత్రం సమర్పించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. శిబిరంలో అంగన్‌వాడీలు చీరలతో మెడకు ఉరి తాడు వేసుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీకార్యకర్తలు, ఆయాలు, మినీవర్కర్లు, తమ డిమాండ్లు పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండు చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, ప్రాజెక్టు కార్యదర్శి ఎం.జయలక్ష్మి, అధ్యక్షురాలు దుర్గామహేశ్వరి, తలుపులమ్మ, కె.ధనలక్ష్మి, కనకదుర్గ, కె.విజయకుమారి, సుహాసిని, జి.అనంతలక్ష్మి, శ్రీదేవి, జి.మంగాయమ్మ, వనమాడి యశోద, శైలజ పాల్గొన్నారు.

రామచంద్రపురం: రామచంద్రపురం, కె.గంగవరం ప్రాజెక్ట్‌లకు చెందిన అంగన్వాడీలు మంగళవారం దున్నపోతుకు వినతిపత్రం అంజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా అంగన్వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బటన్ ఎక్కడ నొక్కాలో మాకూ తెలుసని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, వీరల క్ష్మి, జహీరా, గొంతీదేవి, వాసంశెట్టి సూర్యకుమారి, విజయలక్ష్మి, శ్రీదేవి, దుర్గ, వెంకటరత్నం, వీరవేణి, రెండు మండలాల అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

మండపేట: డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. సమస్యలపై ప్రభుత్వం స్పందించక పోవడంతో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీలకు సీఎం ఇచ్చిన హామిలను వెంటనే నెరవేర్చాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని దున్నపోతుకు వినతిపత్రం అందించి వినూత్న ప్రదర్శన చేశారు. కె.నాగలక్ష్మి, సీహెచ్ రత్నకుమారి, టి.నిర్మల, కె.అనంతలక్ష్మి, ఎం.శేషవేణి, ఎం.రాజేశ్వరి, కె.పెద్దింట్లమ్మ, టి.సత్యవతి పాల్గొన్నారు.

మామిడికుదురు: డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. ప్రభుత్వం సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలపై చర్యలు తీసుకుంటామని ఇచ్చిన జీవో ప్రతులను మంగళవారం దీక్షా శిబిరం వద్ద దహనం చేశారు. ప్రభుత్వ తీరు మారి తమ కోర్కెలు తీర్చాలంటూ దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వం భయపెడితే బెదిరేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.అన్నపూర్ణ, జి.సూర్యకాంతం, కె.వెంకటలక్ష్మి, సీఐటీయూ నాయకులు కుడుపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనపార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి

పి.గన్నవరం, జనవరి 2: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని పలువురు వక్తలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో జరిగిన జనసేన ముఖ్య నాయకుల సమావేశంలో వక్తలు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులో భాగంగా టిక్కెట్ ఎవ్వరికి కేటాయించినా అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మద్దా చంటిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండలాల పార్టీ అధ్యక్షులు సాధనాల శ్రీ వెంకటసత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, జాలెం శ్రీనివాసరాజా, సర్పంచ్‌లు పసలపూడి రామకృష్ణ, యల్లమిల్లి కృష్ణవేణి, నాయకులు సూరయ్యకాపు, వీరమహిళలు పెనుమాల లక్ష్మి, గణశాల దీపిక, ఏసుకుమారి, బోనం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'కాపు, తెలగలను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది'

పి.గన్నవరం, జనవరి 2: కాపు, తెలగ, ఒంటరి, మున్నూరు సామాజిక వర్గాల ప్రయోజనాలను విస్మరించే రాజకీయ పార్టీలు తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందని జాతీయ కాపునాడు కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్‌హెచ్చరించారు. పోతవరంలో మండల కాపునాడు అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక, విద్య, ఉద్యోగ పరంగా వెనుకబడిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మూన్నూరుకాపులకు వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు కల్పించే పార్టీకే తమ సామాజిక వర్గాల సహకారం ఉంటుందన్నారు. అనంతరం కాపునాడు నాయకులు అబ్బిరెడ్డి సురేష్‌ను సన్మానించారు. ముఖ్య నాయకులు ఆచార్య వేమనశ్రీనివాసరావు, గంగుమళ్ల శ్రీనివాస్, కాకిలేటి దుర్గారావు, మండల కాపునాడు ఉపాధ్యక్షులు దైవాల రాంబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేసుల పేరుతో బెదిరించడం అన్యాయం

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

అమలాపురం టౌన్, జనవరి 2: మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిదో రోజుకు చేరుకుంది. జగన్ ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో తాత్సారం చేస్తోందని ఏఐటీయూసీ నాయకుడు కొప్పుల సత్తిబాబు ఆరోపించారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. తొమ్మండ్రు గోపీ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో కోటేష్, మూర్తి, దుర్గాప్రసాద్, శ్రీను, అప్పారావు, వరలక్ష్మి, తలుపులమ్మ, అనంతలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు. శిబిరాన్ని మానవహక్కుల వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.పవన్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కామనగరువు బీవీ రమణయ్య నగర్‌లో మంగళవారం ఆర్పీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బుధవారంలోగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే వారితో పాటు ఆర్పీఐ నాయకులు, కార్యకర్తలు సమ్మెలో పాల్గొంటారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ లోక్ తెలిపారు. పెనుమాల చిట్టిబాబు, పెయ్యాల పరశురాముడు, చెల్లుబోయిన భానుప్రసాద్, పరమట శ్రీను, దోనిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోరిపర్తి నాగభూషణం ఏడో రోజు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఒప్పంద పారిశుద్య కార్మికులను తక్షణం పర్మినెంట్ చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పిల్లి వెంకటరావు, గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గొరిపర్తి భీమశంకర్, ముత్యాల నాగరాజు, జి. చినఅప్పారావు, మందపల్లి వినోద్, కార్మికులు పాల్గొన్నారు.

మండపేట: మున్సిపాల్టీలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులు సమ్మె కొనసాగుతుంది. మంగళవారం కార్మికులు వినూత్న రీతిలో ఒంటికాళ్లపై నిలబడి ప్రభుత్వం తీరుకు నిరసన తెలిపారు.

జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

ఆత్రేయపురం, జనవరి 2: జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహణపై ర్యాలి జడ్పీ హైస్కూల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రాంగణాన్ని పరిశీలించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈనెల7న జరిగేపోటీలో 52మండలాల నుంచి టీముకు ముగ్గురు విద్యార్థుల చొప్పున 52టీములు పాల్గొంటాయన్నారు. విజేతలకు డీఈవో కమలకుమారి బహుమతులు అందజేస్తారన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజామొద్దీన్ పాల్గొన్నారు.

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వద్దు'

అమలాపురం టౌన్, జనవరి 2: మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం విధాన నిర్ణయాన్ని ప్రభుత్వం, ప్రతిపక్షాలు సైతం విరమించుకోవాలని ఆంధ్రా ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండు చేశారు. ఈనెల7న 'చలో అమలాపురం' చేపట్టినట్టు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి ఆయా కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు పేర్కొన్నారు. అమలాపురం శుభకలశం సెంటర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించి ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్, బొలిశెట్టి శంకర్, మోకా శ్రీనివాసరావు, బొర్రా సుబ్బారావు, వాసర్ల సూరిబాబు, ఫణీంద్రకుమార్, మట్టపర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకుఉచిత ప్రయాణ నిర్ణయాన్ని అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు వెంటనే వెనక్కు తీసుకోవాలని ది రాజోలు తాలూకా గోదావరి డెల్టా ఆటో ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమ సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.రాజోలులో బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆటో కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డు పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా ఆటో యూనియన్ అధ్యక్షుడు గంటా రత్నరాజు, రాజోలు మండల అధ్యక్షుడు పితాని సురేంద్ర, కడలి రామకృష్ణ, బొక్కా శ్రీను, తాడి రాజేష్, చింతపల్లి రాము, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బండారులంకలో తాచు హల్‌చల్

అమలాపురం రూరల్, జనవరి 2: బండారులంక శివారు స్టేట్ బ్యాంకు కాలనీలో మంగళవారం చిక్కాల సత్యనారాయణ ఇంటి వద్దకు వచ్చిన గోధుమ తాచు బుసలు కొట్టింది. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ ఆ పామును చాకచక్యంగా పట్టుకుని బంధించగా పలు పర్యాయాలు ఆగ్రహించింది.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తాం



జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

ద్రాక్షారామ, జనవరి 2: టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని శాసనమండలి మాజీ వైస్‌చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం చోడవరంలో ఆయన నివాసంలో నియోజకవర్గ జర్నలిస్టులతో ఆత్మీయసమావేశం ఏర్పాటుచేశారు. జర్నలిస్టులను శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మండల అధ్య క్షుడు పితాని వీరభద్రరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు పెంకే సాంబశివరావు, అక్కల రిష్వంత్ రాయ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు పేపకాయల బాబ్జి,చంద్రు వీవీఎస్ఎస్ చౌదరి, మరివాడ సూరిబాబు, సలాది రమేష్, రాయుడు లీలాశంకర్, కాళ్ల సత్యనారాయణ, కొసనా శ్రీనివాసరావు, పంపన శ్రీను, బళ్ల లక్ష్మి, జాస్తి విజయలక్ష్మి, టీడీపీ జనసేన సమన్వయకర్త వైట్ల గజలక్ష్మీ, నియోజకవర్గంలో ప్రింట్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిపై దాడి

ఇద్దరికి తీవ్రగాయాలు

ఆత్రేయపురం, జనవరి 2: పంచాయతీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా వారిని తీవ్రంగా కొట్టిగాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆత్రేయపురం పంచాయతీ పరిధి చినపేటలో మంగళవారం మధ్యాహ్నం పంచాయతీ సిబ్బంది డ్రైనేజీ పూడికతీత పనులు చేస్తున్నారు. పూడికతీసిన మట్టిని డ్రైనేజీ పక్కనే రోడ్డుమీద వేశారు. బురద మట్టి పక్కనే ఉన్న ఆటో మీద పడింది. దీనిపై తన ఆటోపై వ్యర్థాలు పడి ఉన్నాయంటూ బండి దిలీప్ పంచాయతీ సబార్డినేట్ జీవీవీ సత్యనారాయణపై గొడవ పడి దుర్భాషలాడి కర్రతో కొట్టిగాయపరిచాడు. దివ్యాంగుడైన సత్యనారాయణ సచివాలయ సిబ్బందికి, కార్యదర్శికి సమాచారం అందించాడు. డిజిటల్ అసిస్టెంట్ చింతా సాయిరామ్‌ను బండి రవికుమార్, వినయ్, పమ్మి రాజ్‌కుమార్, పమ్మి బేబి తదితరులు దుర్భాషలాడి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో సిబ్బంది సత్యనారాయణ, సాయిరామ్‌లకు బలమైన గాయాలు కావడంతో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

అమలాపురంటౌన్, జనవరి2:విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి దక్షిణ భారత విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన పాఠశాలల విద్యార్థులను కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాఅభినందించారు. డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం ప్రసాదరాజు, సత్యనారాయణ, గౌరీశంకర్, విద్యార్థుల గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కె.గంగవరం, జనవరి 2: సుందరపల్లి, శివల గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలను సర్పంచ్‌లు సలాది లక్ష్మీశిరీష, అనసూరి సాయిబాబు అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, సలాది శేఖర్, కాదా వెంకట రమణ, సుందరపల్లి మాజీ సర్పంచ్ రెడ్డి జయరాజు, వర్మ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'





అమలాపురం: భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆనందరావు, ఆలమూరుబాబుతో భవిష్యత్ గ్యారంటీ పత్రాలను అందిస్తున్న బండారు

అమలాపురం టౌన్, జనవరి 2: చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పట్టణంలోని అబ్బిరెడ్డివారి కాలనీలో మంగళవారం రచ్చబండ నిర్వహించారు. అనంతరం బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, అబ్బిరెడ్డి చంటి, అబ్బిరెడ్డి సీతయ్య, సుంకర కన్నయ్య, పేరూరు విజయలక్ష్మి, కుసుమ సూర్యమోహనరావు, బత్తుల ప్రసాద్, పట్నాల రమణ, చిక్కాల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సైకో జగన్ పాలనను తరిమికొడదాం

ఆలమూరు, జనవరి 2: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దిగువ స్థాయికి తీసుకొచ్చిన సైకో జగన్ పాలనను తరిమికొట్టాలని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. పినపళ్లలో మంగళవారం 'బాబుష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ' నిర్వహించారు. సార్వత్రికఎన్నికల్లో టీడీపీ -జనసేన సంయుక్త కూటమితో సైకో పాలనకు కాలం చెల్లనున్నదని జోస్యం చెప్పారు. మహిళలకు కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ సంగిత సుభాష్, టీడీపీ నాయకులు వక్కపట్ల లక్ష్మణరావు, కె.సునీల్, దండంగి మమత,వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, ఈదల సత్తిబాబు, కొత్తూరు సాయి పాల్గొన్నారు.

టీడీపీ కూటమి విజయం తథ్యం

కాట్రేనికోన, జనవరి 2: ఎన్నికల్లో టీడీపీ,జనసేన కూటమి విజయం ఖాయమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రేవు రమేష్ అన్నారు. మొండిపోర, చిలకాయిచెరువు ప్రాంతాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు మాదే యోగీశ్వరి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్తాల ప్రసాద్, గెద్దాడ శ్రీను, నేలపాటి రాంకీ, పచ్చిమాల శ్రీనివాస్, గుబ్బల వెంకటేశ్వరరావు, నేలపాటి బాలయోగి, కాంద్రేగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ద్వారా అభివృద్ధి

మలికిపురం: విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల ద్వారా కేంద్ర ప్రభుత్వం జీవనోపాధి అవకాశాలు కల్పించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్ర మంలో భాగంగా మంగళవారం లక్కవరంలో సర్పంచ్ కోట పుష్పకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎం.ముత్యంవీరాస్వామి నాయుడు, శృంగారపు సూర్య ప్రకాశరావు, కె.కనకేశ్వరరావు, అడబాల రాంబాబు, సీహెచ్ శివరామకృష్ణంరాజు, నిరంజనరావు, ఎం.చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ కోఆర్డినేట్ కోకన్వీనర్‌గా మహాలక్ష్మిరావు



మామిడికుదురు, జనవరి 2: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేట్ కోకన్వీనర్‌గి బి.దొడ్డవరానికి చెందిన పసుపులేటి మహాలక్ష్మిరావును నియమించారు.

27/13 చట్టాన్ని రద్దు చేయాలి

అమలాపురం టౌన్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 27/2013 చట్టాన్ని తక్షణం రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని న్యాయవాదులు డిమాండు చేశారు. అమలాపురం బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణం ఎదుట న్యాయవాదులు మంగళవారం రిలే దీక్ష చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీక్షలో సీనియర్ న్యాయవాదులు కటికదల సత్యనారాయణ, పినిపే రాధాకృష్ణ, నాగాబత్తుల శ్రీనివాసరావు, అడపా వెంకటశ్రీనివాసరావు, మెరుగుపువ్వు మోహనరావు, వెంపరాల భాస్కర శాస్త్రి పాల్గొన్నారు. న్యాయవాదులు జీఎస్ నాయుడు, నిమ్మకాయల దొరబాబు, క్రొత్తు సత్యచంద్రమోహన్, యార్లగడ్డ రవీంద్ర, కోలా త్రిమూర్తులు, బడుగు భాస్కరజోగేష్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

విధులకు హాజరుకాకపోతే శాఖాపరమైన చర్యలు

అమలాపురంటౌన్, జనవరి 2:అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెను ఈనెల5వ తేదీలోగా విరమించి విధులకు హాజరుకావాలని కలెక్టర్ కార్యాలయం మంగళవారం విడుదలచేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సమ్మె విరమించకుంటే ప్రభుత్వ నిబంధనలను అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

రైతులకు శిక్షణ

యానాం, జనవరి 2: యానాం వ్యవసాయశాఖ, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రైతులు ఖరీఫ్ 2023-24లో వరి పండించిన ఎస్సీ కేటగిరీ రైతులకు ఎకరాకు రూ6వేలు చొప్పున 46.30ఎకరాలకు రూ.2,77,800, జనరల్ కేటగిరీ 99రైతులకు ఎకరాకు రూ.5వేలు చొప్పున 168.85ఎకరాలకు రూ.8,44,250 చెక్కును ఆర్ఏ మునిస్వామి, వ్యవసాయ శాఖ డీడీలు రైతులకు అందజేశారు. కొబ్బరిలో నూతన సాగు పద్ధతిలో విలువ ఆధారిత అనే అంశంపై రైతులకు శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రులు యానాంలో పర్యటన

యానాం, జనవరి 2: కేంద్ర మంత్రులు పరోశత్తమ్ రూపాల్, ఎల్.మురుగన్‌లు యానాంలో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయనే అంశాలను పరిశీలించేందుకు బుధవారంవారు యానాం రానున్నారని పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. బుధవారం సావిత్రినగర్, గిరియంపేటలలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	హాయ్ నాన్న
వెంకటరమణ	డెవిల్
శ్రీలలిత	బబుల్‌గమ్
శేఖర్ స్క్రీన్-1	సలార్
శేఖర్ స్క్రీన్-2	డంకీ
రమా	డెవిల్
గణపతి	యానిమల్
వెంకటపద్మావతిస్క్రీన్-1	సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	సలార్

కళ్లజోళ్లు ఇప్పించండి మహాప్రభో

మామిడికుదురు, జనవరి 2: గతంలో జరిగినజగనన్న సురక్షా పథకంలో కంటి పరీక్షలు నిర్వహించి ఇప్పటి వరకు తమకు కళ్లజోళ్లు పంపిణీ చేయలేదని మంగళవారం ఆదుర్రు గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం మంగళవారం ఆదుర్రు పంచాయతీ వద్ద జరిగింది. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్షా జిల్లా కోఆర్డినేటర్ జాన్‌లెవీ పాల్గొన్నారు. గతంలో నిర్వహించిన శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 187మందికి కళ్లజోళ్లు అవసరం అవుతాయని తేల్చారు. కానీ ఇప్పటి వరకు కళ్లజోళ్లు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోఆర్డినేటర్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నాలు గైదు రోజుల్లో వంద మందికి కళ్లజోళ్లు అందిస్తామని, మిగతావి అంచెలంచెలుగా అందించనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశాన్ని విజయవంతం చేయండి

మలికిపురం, జనవరి 2: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. జనవరి 3న మంగళగిరి సి కన్వెన్షన్ హాలులో బుధవారం జరుగుతున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొనాలని గ్రామగ్రామాన తిరుగుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. తూర్పుపాలెంలో జరిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమావేశంలో గొల్లపల్లి మాట్లాడారు. గ్రామాలఅభివృద్ధి జరగకుండా గ్రామ పంచాయతీలకు, మండలపరిషత్‌లకు రాజ్యాంగ బద్ధంగా వచ్చిన నిధులను సీఎం జగన్ దారి మళ్లించి గ్రామాల అభివృద్ధి జరగకుండా సర్వనాశనం చేశారన్నారు. సమావేశంలో ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్‌లు చెల్లుబోయిన హెలీన, గుర్జింక సత్తిబాబు, యెనుముల నాగు, రాపాక ఆనందకుమార్, మందపాటి నాగేశ్వరరావు, అడబాల సాయిబాబు, కడలి సత్యనారాయణ, పొలమూరి శ్యామ్‌బాబు, ముదునూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పసలపూడిలో చీరలు పంపిణీ

రాయవరం, జనవరి 2: పసలపూడి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నా భోజనం ఆయాలు, శానిటరీ వర్కర్లకు చీరలను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ప్రగతి రామారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడాదిలో ఒక్క సీఎల్ వినియోగించకుండా పనిచేసిన ఉపాధ్యాయుడు కాళిశెట్టి శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమార్, ఎన్.భాస్కరరెడ్డి, ఎస్.సూరిబాబు, కె.శ్రీనివాస్, ఎం.రాజు, యూటీఎఫ్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి జి.మురళికృష్ణ పాల్గొన్నారు.

జగన్ మనసు మార్చాలంటూ ఆంజనేయస్వామికి పూజలు

ముమ్మిడివరం, జనవరి 2: నగరపంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారంనాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. పోలమ్మ చెరువుగట్టున ఉన్న అభయాంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించి తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా సీఎం జగన్‌లో మార్పు తీసుకురావాలని వారు పూజలు జరిపించారు. శిబిరాన్నికౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, దివిమహాలక్ష్మి, అడబాల సతీష్‌కుమార్, నాయకులు కడలి నాగు, మాదాల బుజ్జి, కట్టా సత్తిబాబు, జనిపల్లి సత్యనారాయణ, విళ్ల వీరాస్వామినాయుడు, గొల్లపల్లి గోపి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు పప్పు సుబ్బారాయుడు, మానవహక్కుల వేదిక రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రాజేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు జి.దుర్గాప్ర సాద్‌లు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణకుమార్, ఎస్.అజయ్‌కుమార్,వి.వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటేష్, వై.రమణ, కాశిజార్జి, జి.రమేష్, ఎ.సత్తిబాబు, డి.రమణమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అమలాపురం రూరల్, జనవరి 2: అమలాపురం -చల్లపల్లి ప్రధాన పంటకాల్వపై కామనగరువు వద్ద నిర్మించిన వంతెనపై ఐదుగురితో వెళుతున్న కారు రెయిలింగ్ లేకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పింది. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో వంతెనపై వేలాడు తున్న కారును స్థానికులు బయటకు లాగేందుకు శ్రమిస్తు న్నారు. వంతెన దుస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎస్ఐగా ఎంపికైన సచివాలయ మహిళా పోలీస్‌కు సత్కారం



ఉప్పలగుప్తం, జనవరి 2: ఎస్.కొత్తపల్లి సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తూ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన సర్పంచ్ కుంచే చిట్టికుమారి చిన్న కుమార్తె శ్రీలతను మంగళవారం పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు సన్మానించారు. ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, కుంచే చిన్ని, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


రహదారుల నిర్మాణానికి భూమిపూజ


అయినవిల్లి, జనవరి 2: ముక్తేశ్వరం నుంచి విలస వరకు రూ.2.03 కోట్లతో నిర్మించే ఆర్‌అండ్‌బీ రహదారి బీటీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భూమి పూజ చేశారు. జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కుడుపూడి విద్యాసాగర్, వేటుకూరి వెంకట్రాజు, కాశి వీరవెంకటసత్యనారాయణ, కోనే చంద్రశేఖర్, గుత్తుల నాగబాబు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

అంబాజీపేట, జనవరి 2: కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 12,13తేదీల్లో జరగనున్న ఎస్టీయూ 75ఏళ్ల వేడుకలు సందర్భంగా స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో పోస్టర్లను ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు ఆవిష్కరించారు. వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బోనం గంగాధర్ తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్.సతీష్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ప్రకాశరావు, జిల్లాఉపాధ్యక్షుడు పొట్టుపోతు శ్రీనివాసరావు, ఎండీఎస్ఎం షరీఫ్, బల్ల శివ, సూర్యారావు, భ్రమరాంబికాదేవి, లలితారాణి పాల్గొన్నారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా శ్రీనివాస్





ఉప్పలగుప్తం, జనవరి 2: ఎస్టీయూ మండల అధ్యక్షునిగా వై.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు సూదా రామారావు అధ్యక్షతన మంగళవారం భీమనపల్లిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా నూకల రుష్యేంద్రకుమార్, ఆర్థిక కార్యదర్శిగా డి.బాలకృష్ణ, అభయ్ కన్వీనర్‌గా అడబాల సుబ్బారావు, ఉపాధ్యాయవాణి కన్వీనర్‌గా మాగాపుసత్రాజు, సీపీఎస్ కన్వీనర్‌గా రవికుమార్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా చిక్కం మైనర్‌బాబు, సూదారామారావు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, ఎన్పీఏఎస్ నాగేశ్వరరావు, వంగా రాజేంద్రప్రసాద్, కె.రంజిత్‌కుమార్, జీవీ కృష్ణారావు, వెలిగట్ల రత్నకుమారి, శ్యామల ఎన్నికయ్యారు. నిమ్మన సత్యనారాయణ పరిశీలనలో జరిగిన ఎన్నికలకు అడబాల దొరబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

'7న చలో అమలాపురం' విజయవంతం చేయాలి

అల్లవరం, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు విధాన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల7న తలపెట్టిన 'చలో అమలాపురం' విజయవంతం చేయాలని ఆంధ్ర ఆటోవాలా వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. దేవగుప్తంలో మంగళవారం జరిగిన సమావేశంలో దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్, బొలిశెట్టి శంకర్, మోకా శ్రీనివాసరావు, బొర్రా సుబ్బారావు, బొలిశెట్టి శంకర్, వాసర్ల సూరిబాబు, బొమ్మి ఫణీంద్ర, మట్టపర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు హేమంత్ ఎంపిక

అమలాపురం రూరల్, జనవరి 2: ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి.హేమంత్ బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వి.శ్రీనివాసరావు తెలిపారు. అతడిని హెచ్ఎంతో పాటు స్టాఫ్ సెక్రటరీ జి.పెద్దిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ కె.కృష్ణార్జున, సర్పంచ్ చొల్లంగి శివానీని, అప్పాజీ, పీఈటీ వి.నరసింహారావు అభినందించారు.

వైసీపీ బీసీసెల్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

మండపేట, జనవరి 2: వైసీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా మండపేటకు చెందిన కుక్కల శ్రీనివాస్ నియమితులయ్యారు, స్థానిక పార్టీ కార్యాల యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను మంగళవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌ను తోట అభినందించారు.


రేవు శ్రీనుకు మాతృవియోగం

కె.గంగవరం, జనవరి 2: కోటిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను)కు మాతృ వియోగం కలిగింది. శ్రీను తల్లి సూర్యకాంతం మంగళవారం మృతి చెందారు. సూర్యకాంతం మృతదేహాన్ని మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ సందర్శించారు. రేవు శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, జనవరి 2: గ్రామీణ ప్రాంతాలకు ఏర్పాటు చేస్తున్న బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. ఇటీవల వక్కలంక గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు అమలాపురం నుంచి రావులపాలెం బస్సు సౌకర్యాన్ని మంత్రి విశ్వరూప్ ఏర్పాటు చేశారు. ఈబస్సు సర్వీసును సర్పంచ్ వాసంశెట్టి రేవతి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అయినవిల్లి జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, సొసైటీ అధ్యక్షుడు వాసంశెట్టి రాంబాబు నాయకులు వాసంశెట్టి పెదబాబు, జనుపల్లి ఏడుకొండలు, పిల్లి రమేష్ పాల్గొన్నారు. అనంతరం తొండవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు పాల్గొన్నారు.

పంటకాలువలో యువకుడి మృతదేహం లభ్యం



కొత్తపేట, జనవరి 2: రావులపాలెం-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువలో కొత్తపేట మండలం ఏనుగుల మహల్ సమీపంలో 17ఏళ్ల యువకుడి మృతదేహం లభ్యమైంది. తొలుత గుర్తుతెలియని మృతదేహంగా భావించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఎస్ఐ జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో భద్రపరిచారు. ఈనేపథ్యంలో రావులపాలేనికి చెందిన సింహాద్రి వినయ్‌కుమార్ మృతదేహంగా బంధువులు గుర్తించారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం.. రావులపాలేనికి చెందిన సింహాద్రి జ్యోతి భర్త చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కుమారులు. పెద్దవాడైన మృతుడు వినయ్‌కుమార్ మండపేట ఆదిత్య జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. డిసెంబరు 31రాత్రి వినయ్‌కుమార్ స్నేహితుడంటూ వచ్చి ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లినట్టు జ్యోతి పోలీసులకు తెలిపింది. ఆ రోజు వినయ్‌కుమార్ ఫోన్ ఇంటివద్దే ఉంచడంతో ఎవరికీ చేయాలో అర్థం కాక కుటుంబ సభ్యులు ఊరుకున్నారు. మరుసటి రోజు ఇంటికి రాకపోడంతో చుట్టుపక్కల గాలించామని, ఆ స్నేహితుడు ఎవరో కూడా తమకి తెలియదన్నారు. మంగళవారం ఉదయం పంటకాలువలో మృతదేహం లభ్యం కావడంతో వినయ్‌కుమార్‌గా గుర్తించామన్నారు. తమకుమగదిక్కులేదని, ముగ్గురు కుమారులతో తండ్రి కోనేటి వేణు పర్యవేక్షణలో ఉంటున్నామన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని జ్యోతి ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జ్వాలాసాగర్ తెలిపారు.